బీసీ కమిషన్ ఏర్పాటు తర్వాతే కులగణన


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: రాష్ట్రంలో బీసీ కమిషన్ ఏర్పాటు చేసి వెంటనే కులగణన ప్రక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు బీసీ సమాజాన్ని సామాజికంగా రాజకీయంగా జాగృతం చేస్తూ బీసీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. శనివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపట్టకుండా రిజర్వేషన్ వ్యతిరేకులు చేసే కుట్రలను బీసీలు తిప్పికొట్టాలని కోరారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, నందగోపాల్, పండరినాథ్ పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి కృషి చేయాలి

మెట్టు సాయికుమార్‌ను కోరిన నేతలు

కవాడిగూడ: రాష్ట్రంలోని 30 లక్షల మంది గంగపుత్రుల హక్కుల సాధన, అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్ర, జెడ్‌పీటీసీ బాలయ్యలు రాష్ట్ర మత్స్య సహకార కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కోరారు. శనివారం మెట్టు సాయిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో గంగపుత్రులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. గంగపుత్ర కులవృత్తిపై ఆధారపడిన వారికి న్యాయం చేయాలని మెట్టు సాయకుమార్‌ను కోరారు. కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, జి.శివరత్నం, ఎర్వ బాలయ్య, ఎరబోయిన మల్లేష్, సుధాకర్, కట్ట నర్సింగ్, రవి, అవినాష్, స్వర్ణలత, సంగీత, సునీత, భారతి, పద్మ, మంజుల, లక్ష్మయ్య, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.


మెట్టు సాయిని సన్మానిస్తున్న గడప శ్రీహరి, అంబటి మల్లయ్య, సుధాకర్, బాలయ్య తదితరులు

కిషన్‌రెడ్డి నివాసంలో...



కాచిగూడ: త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డిని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నివాసంలో గవర్నర్‌ను బీజేపీ నేతలు సి.నందకిషోర్ యాదవ్, కె.రమేష్ యాదవ్ తదితరులు కలిసి అభినందనలు తెలియజేశారు.

ఎంపీ లక్ష్మణ్ నివాసంలో...

చిక్కడపల్లి: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి శనివారం ఉదయం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనకు డాక్టర్ కె.లక్ష్మణ్, ఆయన సతీమణి ఉమ ఆహ్వానించి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు కొద్ది దేశ రాజకీయాలపై ఏకాంతంగా మాట్లాడుకున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ తమ బీటీలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, సాధారణంగా కలుసుకున్నట్లు వారు చెప్పారు.



‘క్లౌడ్ టెక్నికో’ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

బాధితుల రౌండ్ సమావేశంలో నల్లా రాధాకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అమాయకులను మోసం చేసి రూ.200 కోట్లు దండుకున్న స్పాట్‌లోన్, క్లౌడ్ టెక్నికో సంస్థ కుంభకోణంపై విచారణ జరపాలని, యజమాన్యాన్ని అరెస్టు చేయాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాన్య బాధితుల సేవా సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆ సంస్థ ఎం.డి. కాకుమాను రవికుమార్‌తో జూమ్ మీటింగ్‌లు పెట్టి ప్రజలను మభ్యపెట్టిన ప్రశాంత్, పావని, హరికృష్ణ, ప్రసాద్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రూ.1,600 చెల్లిస్తే పది వేల రూపాయల నుంచి లక్షలాది రూపాయల వరకు కమిషన్‌లు వస్తాయని మభ్యపెట్టడంతో 10 లక్షల మంది మోసపోయారన్నారు. కార్యక్రమంలో సామాన్య బాధితుల సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, తెలంగాణ అధ్యక్షుడు పూరపాటి నాగేశ్వర్‌రావు, మహిళా అధ్యక్షురాలు సాయినోజి మనోహర, మిర్యాల రమణ తదితరులు పాల్గొన్నారు.

రిసాలలో తీవ్రంగా డ్రైనేజీ సమస్య

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ రిసాలలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి ఆ ప్రాంతంలో పర్యటించారు. సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.


రాంనగర్ డివిజన్ రిసాలలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

చెట్ల కొమ్మల తొలగింపు


నింబోలిఅడ్డలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

కాచిగూడ: రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా మారిన చెట్లకొమ్మలను శనివారం జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావు ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్, ఆర్‌వీఎల్ రమేష్, సురేందర్, అజయ్ సింగ్, మహేష్ పాల్గొన్నారు.

ఎవరొస్తారో?

ఓయూ వీసీ నియామకంపై ఉత్కంఠ

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా ఎవరొస్తారోనని వర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యావేత్తలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. క్యాంపస్‌లో కొత్త వీసీ రాక పై సర్వత్రా చర్చ జరుగుతోంది. వీసీ పోస్టు కోసం 93 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకోగా అందులో సగానికి పైగా విశ్రాంత అధ్యాపకులే ఉన్నారు. ప్రస్తుతం ఓయూలో ప్రధాన సమస్య అధ్యాపకుల కొరత. గతంలో ఓయూలో 1257 పర్మనెంట్ అధ్యాపకులు పని చేయగా ప్రస్తుతం 372 మంది మాత్రమే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు వీసీలు పనిచేసినా ఒక్క పోస్టును కూడ భర్తీ చేయాలేదు. ప్రభుత్వం మారిన అనంతరం కొత్త సీఎం రేవంత్ రెడ్డి వర్సిటీల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తారనే నమ్మకంతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. అయితే ఓయూలో అన్ని వర్గాల ఒత్తిడిని తట్టుకొని అధ్యాపక ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసే సత్తా గల ప్రొఫెసర్ ఓయూకు అవసరం అని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.


ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనం


చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు


ప్రదర్శనను తిలకిస్తున్న ప్రభుత్వ ఆది శ్రీనివాస్, ఎల్. రమణ

వావ్.. వీవ్స్

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్రాల ప్రదర్శన

తిలకించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు


వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

కాచిగూడ: నారాయణగూడ పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన వీవ్స్ వస్త్ర ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శన ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన, మన్నికైన చేనేత వస్త్రాలను అందరికీ పరిచయం చేయాలన్న ఉద్దేశంతోనే వస్త్ర ప్రదర్శన ప్రారంభించామని నిర్వహకురాలు గుంటక రూప తెలిపారు. మగువల మనసు దోచే పోచంపల్లి, గద్వాల, ధర్మవరం, నారాయణపేట, కొత్తకోట చేనేత వస్త్రాలు అక్కడ కొలువు తీరాయి. చేనేత వస్త్రాలు వాడటంతో ఆరోగ్యంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అందుకు అందరూ చేనేత వస్త్రాలనే ధరించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. వస్త్ర ప్రదర్శనను మంత్రి శనివారం సందర్శించి తిలకించారు. పలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. నేతన్నల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు మురళి, నేతలు అవ్వారు భాస్కర్, బొమ్మ అమరేందర్, కత్తుల సుదర్శన్, డాక్టర్ చిక్కా దేవదాను, తిరందాస్ యాదగిరి, జయరాజ్, గుర్రం శ్రవణ్, పోరండ్ల శారద, బాసన పద్మ, కందగట్ల శోభ, బొమ్మ ప్రవల్లిక, నోముల రేఖ, పొనగంటి పద్మ, విజయలక్ష్మీ, పుష్పలత, శాంతి, అండాలు, స్వప్న, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.


వస్త్ర ప్రదర్శనలో ముఠా గోపాల్‌ను సత్కరిస్తున్న కత్తుల సుదర్శన్


వస్త్ర ప్రదర్శనలో కొలువుదీరిన కంప్యూటర్ డిజైనింగ్ వస్త్రాలు

కేంద్రమంత్రికి శుభాకాంక్షలు


కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మురళి

నల్లకుంట: కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.మురళి, బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి బి.సంజయ్ కుమార్, బీజేపీ విద్యా విభాగం అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎంకే శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

షేరింగ్ ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

అంబర్‌పేట: షేరింగ్ ఆటో ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. అంబర్‌పేట ఎస్ఐ విజయ్ కథనం ప్రకారం... అంబర్‌పేట ప్రధాన రోడ్ వినాయక్‌నగర్ చౌరస్తా సమీపంలో ఫుట్‌పాత్‌పై జీవనం సాగించే షాబాన్ షా(86) శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఉప్పల్ నుంచి అంబర్‌పేట వైపు వచ్చే షేరింగ్ ఆటో రోడ్డు ఈ వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడ్డ షాబాన్ షా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్వ్యూ కోసం వెళ్లిన యువతి అదృశ్యం


ఎం. వైష్ణవి

నల్లకుంట: ఇంటర్వ్యూ కోసమని ఇంటి నుంచి బయలుదేరిన ఓ యువతి యువతి అదృశ్యమైంది. నల్లకుంట ఎస్సై క్రిష్ణ తెలిపిన వివరాలు... కేర్ టేకర్‌గా పనిచేస్తున్న మరికంటి మంజుల, శ్యామ్ కుమార్ దంపతులు తమ కుమార్తె, కుమారుడితో కలిసి న్యూ నల్లకుంట బాయమ్మలేన్‌లో ఉంటున్నారు. వీరి కుమార్తె ఎం. వైష్ణవి(21) దూరవిద్యలో డిగ్రీ చదువుతూ తండ్రితోపాటు ఓ ప్రైవేటు ఫార్మా కంపెనీలో పనిచేస్తోంది. పరీక్షలు ఉండటంతో గత నెల 5వ తేదీ నుంచి పని మానేసిన ఇంట్లోనే ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో బేగంపేటలోని ఓ కంపెనీలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్తున్నానని కుటుంబసభ్యులకు చెప్పి శనివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తల్లి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే తెలిసిన వాళ్లు, స్నేహితులను విచారించగా కుమార్తె ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన మంజుల తమ కుమార్తె కనిపించడం లేదంటూ శనివారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలి

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: వానాకాలంలో లోతట్టుప్రాంతాలలో వరద సమస్యను జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని టీఆర్టీ జవహర్‌నగర్ మెయిన్‌రోడ్డు వద్ద వరద సమస్య పరిష్కారానికిగాను రూ.50 లక్షలతో చేపట్టిన కచ్చానాలా పైప్‌లైన్ పనులను రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరద నీటి సమస్య వున్న ప్రాంతాలను గుర్తించి కార్పొరేటర్ తమ దృష్టికి తేవాలని, అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ముఠా గోపాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నేతలు పూస రాజు, రమేష్‌రామ్, రత్నసాయిచంద్, డీఈ గీత, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్ తదితరులు పాల్గొన్నారు.


నాలా పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, అనిల్‌కుమార్, ముఠా గోపాల్

ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల సమితి నేత యాదగిరి

ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి నేత సుల్తాన్ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోయపల్లి రంగారెడ్డి అధ్యక్షతన శనివారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమకారుల సేవలను అన్ని విధాలుగా వాడుకొని వారిని విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ మానిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం ఇచ్చి 4 గదుల ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, ప్రతి నెల రూ.30 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య బీమా రూ.20 లక్షల వరకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు ప్రపుల్ రామిరెడ్డి, కేసీఎస్ ప్రసాద్, ఎం.వెంకటస్వామి, కె.వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 15వ తేదీన ఉదయం 10:30 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సుల్తాన్ యాదగిరి తెలిపారు.

అలరించిన సినీసంగీత విభావరి

చిక్కడపల్లి: శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో ఏకగాయని శీర్షికతో శనివారంరాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన సినీసంగీత విభావరి-12 ప్రేక్షకులను అలరించింది. గాయనీగాయకులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను మధురంగా ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా గాయని రాగరేఖకు స్వర విరాజిత సామ్రాజ్ఞి, ప్రదీప్‌చంద్రకు మధురగాన కంఠీరవ, ఎల్ఎస్ ఆచార్యులకు మధురస్వర నందన పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఉదయ్ కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రదీప్‌చంద్ర, ఆచార్యులు, ఉదయ్‌కుమార్, రమణ

గ్రామీణ కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి

ప్రొఫెసర్ కోదండరాం

లాలాపేట: ఆరోగ్యాన్ని పెంచి ఉద్యోగాన్ని కల్పించే కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రొ.కోదండరాం అన్నారు. గ్రామ భారతి 28 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం తార్నాకలోని మర్రి కృష్ణా ఫంక్షన్ హాల్లో ‘మూలం సంత’ (లెట్స్ గో బ్యాక్ టు రూట్స్)ను ఏర్పాటు చేశారు. దీనికి ప్రొ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 45 మంది రైతులు, గో, వ్యవసాయాధారిత ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

నేడు మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు

అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించనున్నట్లు దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఘటం ఊరేగింపు అంబర్‌పేటలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

నేడు కార్యవర్గం ప్రమాణస్వీకారం

నల్లకుంట: ఈ నెల 7వ తేదీన జరిగిన సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ నూతన కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎన్నికల అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నల్లకుంట నర్సింహబస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంఘ్ విద్యానగర్ కమిటీ బంధువులందరూ హాజరు కావాలని కోరారు.

రొయ్యూరు అస్మితకు కళారత్న పురస్కారం ప్రదానం


అస్మితకు కళారత్న బిరుదును ప్రదానం చేస్తున్న వేణుగోపాలచారి

ముషీరాబాద్: ఇండో-కెనడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రొయ్యూరు అస్మితకు కళారత్న జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. ఫిలాన్‌త్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో భారతీయ లలిత కళా ఉత్సవ్ పేరిట భారతీయ క్లాసికల్ నృత్యంలో దేశ విదేశాల్లో గుర్తింపు పొందిన అస్మితకు ఈ పురస్కారాన్ని కేంద్ర మాజీమంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి చేతుల మీదుగా అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఫిలాన్‌త్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత పూస గోపాల్ గుండెపోటుతో మృతి


పూస గోపాల్(ఫైల్)

ముషీరాబాద్: ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, వీఎస్‌టీ కంపెనీ యూనియన్ మాజీ నాయకుడు పూస గోపాల్(77) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యూత్ నేత ముఠా జైసింహ, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి, హరిబాబుయాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరక జగన్, నవీన్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో బీఆర్ఎస్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, ఎయిర్‌టెల్ రాజు, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, బిజ్జి రవవి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీస్థలాలను చెత్తరహితంగా మార్చాలి

కాచిగూడ: మహానగరంలో వేలాది ప్రైవేట్, ప్రభుత్వ ఖాళీస్థలాలు మురికి కూపాలుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయాయని, దానివల్ల భూగర్భజలాల కలుషితం తారాస్థాయికి చేరుతోందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వర్షాలు సమీపిస్తున్న వేళ తక్షణమే ఆయా స్థలాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ సిబ్బంది కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పితే ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో ఆ స్థలాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మిగులు ఆహార పదార్థాలతో తీవ్ర సమస్యలు సృష్టిస్తూ స్థానికులకు, చిన్న పిల్లల ఆరోగ్యానికి తీవ్ర ప్రభావానికి గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రైల్లో నగల బ్యాగు చోరీ

కాచిగూడ: బంగారు ఆభరణాల చేతి బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్‌కు చెందిన కంచర్ల కవిత కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నాగర్‌సోల్ నుంచి నగరంలోని కాచిగూడకు అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తోంది. రైలు పూర్ణ - నాందేడ్ స్టేషన్ల మధ్యన 11 తులాల బంగారు అభరణాలున్న తన చేతి బ్యాగు కనబడలేదు. ఈ మేరకు శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి(55) మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కుట్టుమిషన్ల పంపిణీ

కాచిగూడ: పద్మశాలి కులానికి చెందిన ఒంటరి మహిళలకు శనివారం పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో పద్మశాలి మహిళా సంఘం గ్రేటర్ అధ్యక్షురాలు పోరండ్ల శారద కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో కత్తుల సుదర్శన్, వనం దుష్యంతల, గుంటక రూప, బాసాని పద్మ, బైరి అమరావతి, అర్చన, సుజాత, గీతా, స్వప్న, నందిని, సులోచన, లత, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

